
సాక్షి చిత్తూరు

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024




శరవేగంగా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

చెన్నై-బెంగళూరు ఆరు లేన్ల ఎక్స్ హైవే పనులు పలమనేరు నియోజకవర్గంలో జోరందుకున్నాయి. - IIలో



ఏమారితే ఖాతాలో నగదు ఖాళీ

లాటరీ తగిలిందంటూ సైబర్ కేటుగాళ్లు చేసే మోసాల బారిన పడి కొందరు డబ్బులు నష్టపోయారు. - IIలో



బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు

పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు చేశారు. - IIలో

న్యూస్‌రీల్

గుడిపాల ఎస్‌ఐకు అవార్డు



ఎస్పీ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ రామ్మోహన్

గుడిపాల: వివిధ కేసులను ఛేదించడంతో చూపిన ప్రతిభకు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆయనకు డీజీపీ కామెండేషన్ డిస్క్ బ్రాంజ్ మెడల్ అవార్డ్‌తో పాటు సేవాపత్రం అందజేశారు. 2022లో బి.కొత్తకోట ఎస్‌ఐగా పనిచేస్తున్నప్పుడు సుమారుగా రూ.2 కోట్ల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే 20 దొంగతనం కేసులను ఛేదించి సొత్తు రికవరీ చేశారు. రెండు హత్య కేసుల్లో ఎలాంటి క్లూ లభించకున్నా ఛేదించడం, అలాగే బి. కొత్తకోట మండలంలో వర్షాల ఉధృతికి ఓ కారులో కొట్టుకుపోతున్న ఒక కుటుంబాన్ని ప్రాణాలకు తెగించి కాపాడినందుకు, ఫిర్యాదులపై స్పందించి సత్వర న్యాయం చేసినందుకు 2022వ సంవత్సరానికి గాను ఈ అవార్డు ఆయనకు ప్రదానం చేశారు.

శిలాఫలకాలు కనబడకుండా పెయింటింగ్

- టీడీపీ నాయకుడు చేశాడని వైఎస్సార్‌సీపీ నేతల ఆరోపణ



సచివాలయం శిలాఫలకాలు కనబడకుండా పెయింట్ వేసిన దృశ్యం

గంగవరం: మండలంలోని గంగవరం పంచాయతీ మారేడుపల్లె గ్రామ సచివాలయం శిలాఫలకాలకు పెయింటింగ్ వేసి కనబడకుండా చేసిన ఉదంతం శుక్రవారం వెలుగుచూసింది. వివరాలు..గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల నిర్మాణాలు పూర్తయిన తరువాత ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఎమ్మెల్యే, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారి పేర్లతో శిలాఫలకాలను సచివాలయాల వద్ద ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుత అధికార పార్టీ నాయకులు మారేడుపల్లెలో ఆ శిలాఫలకాలు పూర్తిగా కనిపించకుండా పెయింట్ వేశారు. దీనిపై పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. పంచాయతీ టీడీపీ జనరల్ కార్యదర్శి బాలాజీ ఈపని చేశారని ఆరోపించారు. దీనిపై సోమవారం ఎంపీడీఓ, జిల్లా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

వైద్యానికి ఎమ్మెల్యే సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న కృష్ణారెడ్డి, నేతలు

చౌడేపల్లె: మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన షాహెదాకు పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. నాలుగు రోజుల క్రితం కరెంటు షాక్‌కు ఆమె గురైంది. సర్పంచ్ జయసుధమ్మ, ఎంపీటీసీ షాహీనా మంత్రి దృష్టికి దీనిని తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మంత్రి షాహెదా వైద్యం కోసం ఇచ్చిన రూ.10 వేలను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీనేతలు కలిసి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణరెడ్డి, రవి కుమార్‌రెడ్డి, ఓబులేసు, హస్సేన్, రాంబాబు, మునిగిరి బాబురెడ్డి, రబ్బాని, మహబూబ్‌బాషా, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,142 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.20 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టోకెట్లు లేని భక్తులకు 8 గంటల్లో,ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్ల భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కాణిపాకం.. చవితికి సిద్ధం

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ లైటింగ్, దేవతామూర్తుల విద్యుత్ లైట్ల రూపాలతో ఆలయ పరిసరాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. చూడగానే ఆకట్టుకునేలా పుష్పాలంకరణ చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని అన్ని వసతులు కల్పించారు.



విద్యుత్ కటౌట్లు, దీపాలంకరణలు ..పుష్కరిణి నీటిలో కనిపిస్తున్న ప్రతిబింబాలు

- నేటి నుంచి శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు
- సర్వాంగ సుందరంగా ఆలయం
- ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ
- విద్యుత్ అలంకరణ, దేవతామూర్తుల కటౌట్లతో సరికొత్త శోభ
- భక్తులకు సౌకర్యార్థం మూడు ప్రాంతాల్లో పార్కింగ్ కల్పన

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 27వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు. గత నెల ఉత్సవ తేదీ ఖరారు చేసినప్పటి నుంచి ఏర్పాట్లలో అధికారులు తలమునకలై పనులు పూర్తి చేశారు. ఆలయంతో పాటు రథం, వాహనాలకు రంగులు వేయించడంతో ఉత్సవ కళతో ఉట్టిపడుతున్నాయి. అలాగే అక్కడక్కడా పెయింటింగ్‌తో వేసిన రంగవల్లులు మహిళా భక్తులను ఆకర్షిస్తున్నాయి. అవసరమైన చోట మరమ్మతులు పూర్తి చేశారు. ఇటు చిత్తూరు నుంచి..అటు తిరుపతి మార్గం నుంచి స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా స్వాగతం కటౌట్లు కట్టారు.

- ఆలయ ఆవరణంతా విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. ప్రధాన ఆలయ గోపురం నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు చేసిన దీపాలంకరణ సరికొత్త కాంతులీనుతోంది. దీంతో పాటు మూషిక, అన్వేటి, సుపథ మండపాలు, నవగ్రహ ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయాన్ని కూడా మనోహరంగా అలంకరించారు. దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు ఈ పర్యాయం మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి.ఈ అలంకరణలతో ఎటుచూసినా కాణిపాకంలో 'చవితి' శోభ ఆధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లుతోంది. అలాగే వివిధ రకాల పుష్పాలంకరణతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ముఖద్వారం నుంచి ధ్వజస్తంభం, ఆలయ లోపలి భాగం మొత్తం పలు రకాల పుష్పాలతో అలంకరించారు.
- ఆలయ ఆవరణలో హోమ, యజ్ఞ పూజలు సైతం నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు. వాహనాలకు మూడు చోట్ల పార్కింగ్ స్థలం కేటాయించారు. గణేష్ సేవా సదన్ భవనం ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో బస్సులు, పెద్ద పెద్ద వాహనాలు, బస్టాండు ఆనుకుని ఉన్న స్థలంలో ఆటోలు, కార్ల పార్కింగ్ కోసం ఏర్పాటు చేశారు. ఇవి రెండు నిండుకుంటే..అతిథి గృహం వెనుక భాగంలో మరో పార్కింగ్ స్థలానికి వాహనాలను కేటాయించేలా ముందస్తు ఏర్పాట్లు చేశారు. అన్నదానం, నిత్య ప్రసాదం వితరణ, తాగునీరు అందించనున్నారు.

ఇక భక్తులకు ఇబ్బందులు లేకుండా..

బ్రహ్మోత్సవ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బందోబస్తుకు పోలీసులను నియమించారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు వివిధ శాఖల అధికారులను కలెక్టర్, ఎస్పీ నియమించారు. ఈఓ గురుప్రసాద్ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. తరువాత లడ్డుపోటు, అన్నదానం, కల్యాణకట్టను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.



లడ్డుపోటును పరిశీలిస్తున్న ఈఓ



పుష్పాలంకరణ చేస్తున్న కార్మికులు

ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలి




పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి

పుంగనూరు: వినాయక చవితి పండుగను అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఆది దేవుడిని ప్రతి ఒక్కరూ పూజించి కష్టాలు తొలగిపోయేలా ప్రార్థించాలని, అందరూ సుఖసంతాలతో గడపాలని ఆకాక్షించారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం




సుమిత్ కుమార్ గాంధీ, విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి కోరారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ దిశగా మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు. విఘ్నాలకు, సకల దేవగణాలకు అధిపతి అయిన వినాయకున్ని పూజించి సకల కార్యసిద్ధి పొందాలని ఆకాంక్షించారు.

విఘ్నాలు తొలగి..!



చిత్తూరు అర్బన్: అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి.. విజయాలు సిద్ధించాలని ఆకాంక్షిస్తున్నా. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధి చెంది ముందుకు వెళ్లాలి. చవితి వేడుకలను నిమజ్జనాన్ని ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవాలి.

– మణికంఠ, ఎస్పీ, చిత్తూరు.

ఆంధ్రప్రదేశ్ సీఎం గారి తాలూకా..!

ఏ మోటార్ సైకిల్, అయినా, స్కూటర్ అయినా నంబర్ ప్లేట్ ఉండటం సహజం. నంబర్ ప్లేట్ లేకుండా వెళ్తే అది చోరీ చేసిన బైక్‌గా పోలీసులు అనుమానించి, కేసు నమోదు చేయడం పరిపాటి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ పార్టీపై తెలుగు తమ్ముళ్ల అభిమానం శృతి మించి పాకాన పడింది. నంబర్..గింబర్ జాన్తా నై..అని బైక్‌లపై నంబర్‌ప్లేట్లు తొలగించేశారు. ఏకంగా పసుపు రంగు ప్లేట్‌పై చంద్రబాబునాయుడు ముఖచిత్రంతో 'ఆంధ్రప్రదేశ్ సీఎం గారి తాలూకా' అని ప్లేట్ అమర్చి నియోజకవర్గంలో చక్కర్లు కొడుతున్నారు.

- ద్విచక్ర వాహనాలపై నంబర్ లేని ప్లేట్లు!
- తెలుగు తమ్ముళ్ల రూటే వేరు
- కుప్పంలో ఇదో కొత్త ఒరవడి
- చోద్యం చూస్తున్నఅధికారులు



ద్విచక్ర వాహనంపై 'ఆంధ్రప్రదేశ్ సీఎం గారి తాలూకా' అంటూ వేసుకున్న బోర్డులు

కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు పట్టం కట్టిన తెలుగు తమ్ముళ్లు మోటార్ వాహనాల చట్టం నిబంధనలను తుంగలో తొక్కి, పార్టీ అధినేతపై తమ అభిమానాన్ని కొత్తరీతుల్లో చాటుకునేందుకు ఉబలాటపడుతున్నారు. ద్విచక్ర వాహనాలకు నంబర్లు తొలగించి పెళ్లి పిలుపుల తరహాలో బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా 'ఆంధ్రప్రదేశ్ సీఎం గారి తాలూకా' అంటు నంబర్ ప్లేట్ స్థానంలో తమదైన ప్లేట్ వేసుకుంటున్నారు. తద్వారా తాము టీడీపీ వీరాభిమానులం అని చూపరుల దృష్టిని ఆకర్షించే యత్నం చేస్తున్నారు. ఇలాంటి పోకడల్ని నిరోధించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఈ ఒరవడి మరింతగా విస్తరిస్తోంది.

వీళ్లను కట్టడి చేసేదెవరు..?

నంబర్ లేకుండా ఇలా వెళ్లే మోటార్ సైకిల్ సైక్లిస్టులు ఊహించని విధంగా ప్రమాదాలకు గురైతే పరిస్థితి ఏమిటనే ప్రశ్నకు తావిస్తోంది. ప్రమాదాలు జరిగితే ద్విచక్ర వాహనాలు అడ్రస్ ఎలా గుర్తిస్తారు? నిబంధనలను అతిక్రమిస్తున్నా వీరికి అపరాధ రుసుం ఎందుకు విధించరు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పే నాధుడే లేరు.

ఇదేనా బాబు నేర్పిన క్రమశిక్షణ?

పార్టీలో అందరూ క్రమశిక్షణ పాటించాలని, దానికే మొదటి ప్రాధాన్యత ఇస్తానంటూ పదే పదే సభల్లో ఉపన్యాసాలు ఇచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లకు ఇదేనా నేర్పిన క్రమశిక్షణ అని 'ఆంధ్రప్రదేశ్ సీఎం గారి తాలూకా' ప్లేట్‌తో వెళ్తున్న బైక్‌లను చూసి విస్తుపోతున్నారు. ఇవి చంద్రబాబు దృష్టికి ఇది వెళ్లకున్నా కనీసం వీటిని చూస్తున్న అధికారులు ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ అడ్డుకుంటే తమకే ఇబ్బందులు వస్తాయో అని పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

అభివృద్ధే అజెండా




మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, సీఈఓ గ్లోరియా, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

- జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో చైర్మన్ శ్రీనివాసులు
- ఇసుకపై ప్రజాప్రతినిధుల వాగ్వాదం

చిత్తూరు కార్పొరేషన్: పార్టీకతీతంగా అభివృద్ధే ధ్యేయంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జెడ్పీ తొలి సర్వ సభ్య సమావేశం శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. అధ్యక్షత వహించి చైర్మన్ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యత వారీగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఇసుక దుమారం

గృహ నిర్మాణ శాఖ అంశంపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఇసుక సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, అంతేకాకుండా గృహ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విభేదించారు. దీంతో జెడ్పీటీసీలు, ఆ ఎమ్మెల్యేల నడుమ వాగ్యుద్ధానికి దారితీసింది.

మదనపల్లెలో టమాట మోసం

మదనపల్లె టమాట మార్కెట్‌లో జాక్‌పాట్ పేరిట వ్యాపారులు రైతులను దోచుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోకుండా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని జెడ్పీటీసీ ఉదయ్ ధ్వజమెత్తారు. 35 కేజీలు టమాటాలు తీసుకొని 30 కేజీలకు మాత్రమే డబ్బులు ఇస్తున్నారని, ఇకనైనా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పరిశ్రమల హబ్ ప్లీజ్: జీడీ నెల్లూరు ఎమ్మెల్యే

పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల మధ్య పరిశ్రమల హబ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే థామస్ కోరారు. తిరుపతిలో హౌసింగ్ కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు కోరారు.

ఫ్రీ హోల్డ్ విధానం పెట్టండి

కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్రీ హోల్డ్ విధానం ఆపివేసిందని, దీనిని తిరిగి ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి జెడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి కోరారు.

సగం అంశాలపై మాత్రమే చర్చ

సమస్యలను ప్రాధాన్యత వారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, విద్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ, విద్యుత్, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణభివృద్ధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, స్త్రీ మరియు శిశు సంక్షేమం.. పరంగా మొత్తం 10 అంశాలను అజెండాలో పెట్టారు. కానీ మొదటి 5 అంశాలపై అధికారులు ప్రగతి నివేదించి, మిగిలిన వాటిపై చర్చించకనే సమావేశం ముగించారు. సీఈఓ గ్లోరియా, ఎమ్మెల్సీ భరత్, జేసీ విద్యాధరి, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సహాయ కలెక్టర్ హిమవంశీ, తిరుపతి డీఆర్‌ఓ పెంచలకిషోర్, జెడ్పీటీసీలు, మూడు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

దీఈఓల గైర్హాజరుపై ఎమ్మెల్సీ పర్వతనేని ఆగ్రహం



మూడు జిల్లాలకు సంబంధించి సమావేశానికి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డీఈఓలు రాకపోవడంపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో టీచర్ల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా సర్దుబాటు పూర్తి చేయడం సరికాదని ఆక్షేపించారు. అంతేకాకుండా స్టూడెంట్స్ నమోదు డేటాను తప్పుగా చూపి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అధికారులు కొందరికి మేలు కలిగేలా చక్రం తిప్పారని ఆరోపించారు.

'రైతు భరోసా' ఎందుకివ్వరు?

వ్యవసాయ రంగంలో పెట్టుబడి అందక రైతులు ఇబ్బందులు 'రైతు భరోసా' ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని రామసముద్రం జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. వ్యవసాయాన్ని పండుగ చేయకపోయినా ఫర్వాలేదు కానీ కనీస అవసరాలు తీర్చకపోతే రైతు బతికేది ఎలా? అని నిలదీశారు.

నిలదీసిన తిరుపతి ఎంపీ గురుమూర్తి



గురుమూర్తి

తిరుపతి జిల్లాలో చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులను తిరుపతి ఎంపీ గురుమూర్తి నిలదీశారు. వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 77,717 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయగా, 190 మందికి నిర్ధారణ అయినట్లు నివేదికలో ఇచ్చారన్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మొట్టమొదటగా తిరుపతి జిల్లాలో రెండు 'పింక్ బస్సుల్లో' క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయించి, వైద్య పరీక్షలు నిర్వహిస్తూ స్విమ్స్‌తో అనుసంధానం చేశారన్నారు. 19 ప్రైమరీ హెల్త్ సెంటర్ల పరిధిలో 2,70,234 మంది ఉండగా ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా 1,76,776 మందిని సర్వే చేసి, వీరిలో 78,847 మందికి పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. నిర్ధారణ పరీక్షల కోసం 'పింక్ బస్సు'లో పరీక్షించుకున్న 8053లో 929 మందికి క్యాన్సర్ ఉందని నిర్ధారణైందన్నారు. అయితే 'పింక్ బస్సు' వద్దకు నిర్ధారణ పరీక్షలకు రావలసిన వారు ఇంకనూ70 వేల మంది ఉన్నారన్నారు. వీరందరికీ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఎంతమంది వ్యాధి బారిన పడ్డారో తెలుస్తుందని, ప్రస్తుతం క్యాన్సర్‌తో 250 మంది చికిత్స పొందుతున్నారన్నారు. ప్రాథమిక దశలో నిర్ధారణ చేస్తే వ్యాధి నివారణకు అవకాశం ఉంటుందని, అధికారుల నడుమ సమన్వయం కొరవడి సరైన డేటాని నిక్షిప్తం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రిలో కార్మికుల నిరసన



ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి చెందిన పారిశుధ్య కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆరునెలలుగా తమకు వేతనాలందలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వంద పడకలుగా మారినా తమ సిబ్బంది మాత్రం పెరగలేదన్నారు. అయినప్పటికీ కష్ట పడుతున్నామని అయితే తమ కుటుంబాల పోషణ కోసం వేతనాలు రాకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపై ఓ వినతి పత్రాన్ని ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ వీణాకుమారికి అందజేశారు. వీరికి సీఐటీయూ నాయకులు గిరిధర్, ఓబుల్‌రాజు మద్దతు తెలిపారు. ఇందులో దేవా, లోకేష్, గీత, శ్యామల, బుజ్జమ్మ పాల్గొన్నారు.

మూడు దుకాణాలు అగ్నికి ఆహుతి



బైరెడ్డిపల్లి: చెక్‌పోస్టు కూడలిలో మూడు చిల్లర దుకాణాలు శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతయ్యాయి. రహదారికి పక్కనే పూల వ్యాపారి కన్నయ్య, చెప్పుల వ్యాపారి వెంకటరమణ, ప్రావిజన్స్ వ్యాపారి శ్రీనివాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున దుకాణాల్లో మంటలు చెలరేగడంతో రహదారి వెంట వెళ్లే ప్రయాణికులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పడంతో మిగిలిన దుకాణాల్లో మంటలు చెలరేగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేదా గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శరవేగంగా ఎక్స్‌ప్రెస్ హైవే పనులు





పలమనేరు నియోజకవర్గంలో సాగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

- కర్ణాటకలో ఇప్పటికే 70శాతం పూర్తయిన నిర్మాణం
- ఏపీలో 50 శాతం సాగిన పనులు
- పలు చోట్ల బ్రిడ్జిలు, కల్వర్టులు, అండర్ పాస్‌ల నిర్మాణాలు

పలమనేరు: చెన్నై- బెంగళూరు ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే పనులు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గంలో శరవేగంగా సాగుతున్నాయి. అలైన్‌మెంట్ మేరకు మట్టిరోడ్డు పనులు ఇప్పటికే దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం జల్లి పరచి తారు వేస్తున్నారు. చైన్నై-బెంగళూరు మహా నగరాల మధ్య బైరెడ్డిపల్లె వద్ద నిర్మించే జంక్షన్ పనులు సైతం జోరుగా సాగుతున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే మూడు దశల్లో నిర్మాణం సాగుతుండగా ఇప్పటికే కర్ణాటకలో 70శాతం పనులు పూర్తయ్యాయి. రెండో దశలోని పలమనేరు నియోజకవర్గంలోనూ 50 శాతం పనులు చేశారు. మొత్తంగా డిసెంబర్ నాటికి పూర్తిచేసేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) చర్యలు తీసుకుంటోంది.

పది ప్యాకేజీల్లో నిర్మాణ పనులు చకచకా...

చెన్నై సమీపంలోని శ్రీపెరంబూదూర్ నుంచి బెంగళూరు సమీపంలోని హోస్‌కోట వరకు 283.5 కిలోమీటర్ల మేర ఈ రహదారిని ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) భారత్‌మాల పరియోజన పథకం కింద రూ.16,730 కోట్లతో 2021నుంచి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 90మీటర్ల వెడల్పు రోడ్డు నిర్మాణంలో భాగంగా మూడు దశల్లో పనులు సాగుతున్నాయి. తొలి దశలో కర్ణాటకలో 71కిలోమీటర్లు, రెండు, మూడు దశల్లో భాగంగా మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రంలో పనులు జోరుగా సాగుతున్నాయి. చిత్తూరు జిల్లాలో 91కి.మీల నిర్మాణంలో భాగంగా ఇప్పటికే తారురోడ్లు, కల్వర్టులు, అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణాలు సైతం దాదాపుగా పూర్తికావొస్తున్నాయి.

ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించిన వివరాలు


చెన్నై నుంచి బెంగళూరుకు రోడ్డు దూరం	:	283.5కి.మీ
ఇది కర్ణాటకలో 77కి.మీ, ఏపీలో 91కి.మీ, తమిళనాడులో 93కి.మీ		
గతంలో బెంగళూరు-చెన్నై ప్రయాణ సమయం 6 గంటలు		
ఎక్స్‌ప్రెస్ హైవేలో అయితే కేవలం 2.15 గంటలు మాత్రమే		
ఈ రహదారిలో సాధారణ వేగం గంటకు 120 కి.మీ		
ఎక్స్‌ప్రెస్ హైవేలో మొత్తం బ్రిడ్జిలు	:	162
రైల్వే క్రాసింగ్‌లు: 4 కల్వర్టులు	:	143
పెడిస్ట్రియన్ అండర్ పాస్‌లు: 52, వాహనాల అండర్‌పాస్‌లు	:	41
మొత్తం ఫ్లైఓవర్లు	:	17

ఎక్స్‌ప్రెస్ హైవేకు మూడు రాష్ట్రాల్లో రోడ్డు కనెక్ట్ కానున్న పట్టణాలు

ఈ రోడ్డు కర్ణాటక రాష్ట్రంలో హోస్‌కోట, మాలూరు, బంగార్‌పేట, కేజీఎఫ్, ఏపీలోని చిత్తూరు జిల్లాలో వీకోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బలిజపల్లె, గుడిపాల, తమిళనాడులో రాణిపేట్, వాలాజ, శ్రీపెరంబూదూర్ మీదుగా ఈ రోడ్డు చైన్నై వరకు ఉంటుంది.

ఏమారితే ఖాతాలో నగదు ఖాళీ!

- లాటరీలో కోట్లు తగిలాయని సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు
- ఆన్‌లైన్ మోసాలపై అవగాహన లేక డబ్బులు కోల్పోయి లబోదిబో



రూ.3.6 కోట్లు లాటరీ తగిలిందని వచ్చిన ఎస్‌ఎంఎస్

పలమనేరు: లాటరీ తగిలిందంటూ ఆన్‌లైన్‌లో సైబర్ కేటుగాళ్లు కొన్నేళ్లుగా చేస్తున్న మోసాలు కొత్తేమీ కాదు. వీటి గురించి ఎన్నో పర్యాయాలు పోలీస్ శాఖ హెచ్చరించినను ఇప్పటికీ కొందరు అవగాహన లేక చేతులు కాల్చుకుంటున్నారు. తీరా తాము మోసపోయామని గ్రహించాక బావురుమంటున్నారు. పట్టణంలోని రమేష్ అనే వ్యక్తి మొబైల్‌కు పదిరోజుల క్రితం ఓ ఆగంతకుని నుంచి ఎస్‌ఎంఎస్ వచ్చింది. యూకే కోకకోలా కంపెనీ నుంచి మీకు రూ.90 లక్షలు లాటరీ మీ నంబరుకు తగిలిందని..ఇందుకోసం వివరాలను పంపాలని అందులో సారాంశం. దీంతో ఆశపడిన రమేష్ తన బ్యాంకు ఖాతా, ఏటీఎం, బ్రాంచి కోడ్ తదితరాలను వారి మెయిల్‌కు పంపాడు. అంతే గంట తర్వాత అతని మొబైల్‌కు ..ఖాతాలో ఉన్న రూ.14,600 ఖాళీ అయినట్టు సందేశం వచ్చింది. దీంతో లబోదిబోమంటూ బాధితుడు తనలా మరొకరు మోసపోరాదని మీడియాకు సమాచారమిచ్చాడు. అలాగే, పలమనేరు మండలానికి చెందిన నాయుడు మొబైల్‌కు మూడు రోజుల క్రితం ఓ ఎస్‌ఎంఎస్ వచ్చింది. రూ.3.6 కోట్ల యూకే లాటరీ తగిలిందని, వెంటనే అడిగిన సమాచారంతోపాటు డీడీ పంపాలని అందులో ఉంది. ఒక్కసారిగా అంత డబ్బే..! అని నాయుడు తెగ ఖుషీ అయ్యాడు. దీంతో నాయుడు అదే రోజు సాయంత్రం అందులోని నంబర్‌కు ఫోన్ చేశాడు. ఆవలి వ్యక్తి హిందీలో మాట్లాడడంతో అతడికి అర్థం కాలేదు. తనకు తెలుగు మాత్రమే వచ్చని బదులివ్వడంతో మళ్లీ తామే కాల్ చేస్తామంటూ కాల్ కట్ చేశారు. కొంతసేపటికి ఓ అమ్మాయి నాయుడికి మొబైల్‌కు ఫోన్‌చేసి తెలుగులో మాట్లాడింది. ఇప్పటికే సమయం మించిపోయిందని, లాటరీలోని డబ్బు పొందాలంటే తాము చెప్పిన చిరునా మాకు రూ.10వేలు పంపితే వారం రోజుల్లో రూ.3కోట్లు మూడు ఖాతాలో జమ అవుతాయని నమ్మబలికింది. దీంతో వాళ్లు చెప్పిన నెంబరుకు పదివేలు పంపాడు. ఆపై రోజూ ఏటీఎంకు వెళ్ళడం బ్యాలెన్స్ చూసుకోవడం మొదలెట్టాడు.. శుక్రవారం సైతం పరిశీలించుకున్నా డబ్బు జమ కాకపోవడంతో అనుమానించాడు. తనకు వచ్చిన ఫోన్ నంబర్లకు కాల్ చేశాడు. అవి ఉలుకూపలుకూ లేకుండా పోవడంతో తాను మోసపోయానని గ్రహించాడు. ఇలాంటి ఘటనల్లో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కొంతవరకైనా సైబర్ నేరగాళ్ల భరతం పట్టే అవకాశం ఉంది.

అనుమానం పెనుభూతమై..!

- భార్య గొంతు కోసిన భర్త



పిల్లలతో రూపావతి (ఫైల్), నిందితుడు రమేష్

చంద్రగిరి(తిరుచానూరు): అనుమానం పెనుభూతమై వారి కాపురాన్ని ఛిద్రం చేసింది. కట్టుకున్న దాన్ని కర్కశంగా గొంతు కోసి హతమార్చేందుకు ప్రేరేపించింది. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం మంగళంలో భార్యను చంపేసిన భర్త అనంతరం పోలీసులకు లొంగిపోయిన ఘటన సంచలనంగా మారింది. వివరాలు.. మంగళం క్వార్టర్స్‌కు చెందిన రమేష్, తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన రూపావతికి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులిద్దరూ కూలీ పనులు చేస్తూ కుమార్తెలు చందన ప్రియ, కుందన ప్రియను పోషిస్తున్నారు.ఈ క్రమంలో కొన్ని రోజులుగా రమేష్‌కు తన భార్యపై అనుమానం పెరిగింది. దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి.ఈ క్రమంలో 10 రోజుల క్రితం రూపావతి పిల్లలతో కలసి పుట్టింటికి వెళ్లిపోయింది.

పండుగ కోసం ఇంటికి తీసుకొచ్చి..!

అత్తగారింటికి వెళ్లిన భార్యను పండుగగా తీసుకురావాలని గురువారం రమేష్ తన తండ్రి, తమ్ముడితో కలసి ఎస్టీవీ నగర్‌కు వెళ్లాడు. ఇకపై ఇద్దరి మధ్య ఎటువంటి గొడవలు జరగవని, పిల్లలను, భార్యను పోషించుకుంటామని చెప్పి మంగళం క్వార్టర్స్‌లోని ఇంటికి తీసుకువచ్చాడు. శుక్రవారం వేకువజామున రమేష్ పూటుగా మద్యం తాగి ఇంటికి వెళ్లి మరోసారి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆగ్రహం పట్టలేక గదిలో నుంచి ఇద్దరు పిల్లలను బయటకు పంపించి, గడియ పెట్టాడు. పిల్లలు కేకలు వేస్తున్నా వినిపించుకోకుండా ఇంట్లోని కత్తి తీసుకుని రూపావతి గొంతు కోసి హతమార్చాడు. భార్య చనిపోయిందని నిర్ధారించుకుని, గది తలుపులు తీసి, పిల్లల వద్దకు వచ్చి మీ అమ్మ చనిపోయిందంటూ కేకలు వేశాడు. అక్కడ నుంచి నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

అనుమానంతోనే హతమార్చాడు : అడిషనల్ ఎస్పీ

భార్యపై అనుమానంతోనే రమేష్ హతమార్చాడని అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్‌తో కలసి ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: జిల్లాలో పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయానికి మామిడి, వేపాకు, పూలతోరణాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏకాంబరం ఆధ్వర్యంలో రాహుకాల సమయం 10.30 గంటల నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల అభిషేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు 79 మంది దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులకు ఈఓ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం పుష్కరిణి సమీపంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు రాహుకేతు పూజలకు హాజరయ్యారు.

మహిళా కార్మికుల ధర్నా



లాయల్ పరిశ్రమ ఎదుట బైఠాయించిన మహిళ కార్మికులు

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సెజ్‌లో ఉన్న లాయల్ టెక్స్‌టైల్స్ వద్ద శుక్రవారం మహిళ కార్మికులు ధర్నాకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమ లాకౌట్ ప్రకటించడంపై ఆందోళన చేపట్టారు. కంపెనీ ప్రతినిధులు ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు సైతం ధర్నాకు సంఘీబావం ప్రకటించారు. సీఐటీయూ నేత ముకుందా మాట్లాడుతూ లాయల్ పరిశ్రమలో మొత్తం 600 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని, ఇప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దారు గీతావాణి అక్కడకు చేరుకుని పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో చర్చించారు. కార్మికులకు రావాల్సిన జీతాలు, అలవెన్సు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. అందులో తిరుపతికి చెందిన ఎం గిరిబాబుకు 3 రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా, కార్వేటినగరానికి చెందిన ఆటో డ్రైవర్ జె శరవణ కుమార్ ,తిరుపతికి చెందిన ఆటో డ్రైవర్లు ఎం.ప్రసాద్, ఎస్.మహమ్మద్ ఆజామ్ ఒక్కొక్కరికి 2 రోజుల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

ఎర్ర దొంగకు ఐదేళ్లు.. ఎర్రచందనం చెట్లను నరికి, దుంగలను తరలిస్తున్న కేసులో తిరుపతి రూరల్, దామినీడు, ఇందిరమ్మ అపార్ట్‌మెంట్‌కు చెందిన వేమన్న కుమార్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి ఏ. నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజాన్ ఆఫీసర్ చంద్రశేఖర్ రాజు తెలిపిన కేసులోని వివరాల మేరకు... 2017 అక్టోబర్ 30వ తేదీన వేమన్న కుమార్ 58 కిలోల బరువున్న 2 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నగేష్ వాదించారు.

రెయిలింగ్‌ను ఢీకొని మోటార్ సైకిస్టుకు తీవ్రగాయాలు



గాయపడిన జాన్ శామ్యూల్

బంగారుపాళెం: రెయిలింగ్‌ను ఢీకొని మోటార్ సైక్లిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మండలంలోని పాలేరు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం..బెంగళూరుకు చెందిన జాన్ శామ్యూల్(28)ద్విచక్రవాహనంపై గంగాధరనెల్లూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అదుపు తప్పి పాలేరు వద్ద జాతీయ రహదారి పక్కన రెయిలింగ్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి శామ్యూల్‌ను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పాకాల : గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోసీఐ మద్దయ్య ఆచారి వివరాలను వెల్లడించారు. దామలచెరువు పంచాయతీ రాజీవ్ కాలనీకి చెందిన భాస్కరయ్య కమారుడు చంద్రశేఖర్ జులాయిగా తిరిగేవాడు. ఈ క్రమంలో స్కూటర్ దొంగతనాలకు పాల్పడే మద్దనపల్లెకు చెందిన సూర్యప్రకాష్‌తో స్నేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జూన్ నెల 11వ తేదీ దామలచెరువు సమీపంలో పెదరాయని చెరువు వద్ద ఇరువురు మద్యం సేవించి రూ.3 వేలు అప్పు విషయంలో గొడవ పడ్డారు. చంద్రశేఖర్ పక్కనే ఉన్నరాయితో సూర్యప్రకాష్‌పై దాడి చేసి చంపేసి పరారయ్యాడు. గురువారం ఉప్పరపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జ్ సమీపంలో నిందితుడు ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చంద్రశేఖర్ తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని, మెజిస్ట్రేట్ ముందు ముద్దాయిని హాజరు పరచనున్నట్లు సీఐ వెల్లడించారు. మృతుడు సూర్యప్రకాష్‌పై పలు స్కూటర్ చోరీ కేసులు, ఒక హత్యాయత్నం కేసు ఉన్నట్లు వివరించారు.

తిరుమలలో ఇద్దరి ఘర్షణ

తిరుమల: తిరుమలలో ఇద్దరు వ్యక్తులు టీ కోసం ఘర్షణకు దిగిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ మురళీమోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా, సుండుపల్లెకు చెందిన ఉదయకుమార్ తిరుమలలో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే అనంతపురం జిల్లా కదిరికి చెందిన నర్సింహులు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సాయంత్రం కౌస్తుభం అతిథిగృహం వద్ద ఉదయ కుమార్ నుంచి టీ కొనుగోలు చేసిన నర్సింహులు టీ నాణ్యత బాగాలేదని డబ్బులు ఇవ్వనని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ గొడవలో నర్సింహులు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఈ మేరకు ఉదయకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జీపు విక్రయం పేరిట మోసం

చంద్రగిరి : ఓఎల్‌ఎక్స్ యాప్‌లో జీపు విక్రయానికి ఉందంటూ చంద్రగిరికి చెందిన ఓ యువకుడిని సైబర్ కేటుగాళ్లు మోసం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.వివరాలు..చంద్రగిరి బీడీ కాలనీకు చెందిన షేక్ రఫీ అలియాస్ సోను ట్యాక్సీ డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఓఎల్‌ఎక్స్ యాప్‌లో నరసాపురంలో ఓ జీపు విక్రయానికి ఉండడం చూశాడు. దీంతో జీపు యజమాని హరి అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించాడు. జీపు ధర రూ.40వేలు అని, వెంటనే నగదును పంపిస్తే వేరొకరికి విక్రయించనని నమ్మబలికాడు. దీంతో సోను గురువారం రెండుసార్లు గూగుల్‌పే ద్వారా రూ.40వేలు పంపించాడు. నరసాపురం నుంచి వాహనాన్ని చంద్రగిరికి పంపించేందుకు డీజిల్‌కు రూ.10వేలు, డ్రైవరుకు రూ.3వేలు ఇవ్వాలని తెలపడంతో ఆ నగదును కూడా పంపించాడు. మరోసారి జీపు తెలంగాణ రిజిస్ట్రేషన్‌లో ఉందని, వాటిని తనపై మార్చేందుకు మరో రూ.20వేలు కావాలని అడగడంతో ఆ నగదును సైతం బాధితుడు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇక వాహనం బయల్దేరిందని నమ్మబలికి తరచూ డ్రైవరు రాజు అనే వ్యక్తి ద్వారా మాట్లాడిస్తూ వచ్చాడు. శుక్రవారం వేకువ జామున 3 గంటలకు హరి అనే వ్యక్తి మరోసారి సోనుకు ఫోన్ చేశాడు. జీపు ఒంగోలు వద్దకు వచ్చిందని డీజిల్‌కు డబ్బులు పంపిచాలని చెప్పడంతో రూ.3500లను సోను ట్రాన్స్‌ఫర్ చేశాడు. తర్వాత 4 గంటల నుంచి హరితో పాటు డ్రైవరు రాజు ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గ్రహించాడు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి..!

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద అమ్మవారికి విద్యుత్ కాంతుల నడుమ ఉయ్యాలసేవ నిర్వహించారు.. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై విహరించారు.



రావి ఆకుపై గణనాథుడు

తిరుపతి జిల్లా, చిల్లకూరు మండలంలోని పారిచర్లవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పని చేసే వెంకట రమణయ్య రావి ఆకులపై గణేశ్ చిత్రాన్ని రూపొందించి అబ్బుర పరిచారు. ఆయనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

-చిల్లకూరు

బాదంకాయపై బొజ్జగణపయ్య

యాదమరి ప్రభుత్వ పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దామోదరాచారి బాదం కాయపై విఘ్నేశ్వరుడిని చిత్రీకరించారు. ఇందుకు గాను అక్రిలిక్ రంగులను వినియోగించినట్లు తెలిపారు.

-చిత్తూరు కలెక్టరేట్

